ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

నిజామాబాద్ జిల్లా వార్తలు

3

సోమవారం 1 ఏప్రిల్ 2024

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.35	ఉ. 4.48

ఉపవాసమనేది ఒక కవచంలాంటిది దీని ద్వారా దాసుడు పుణ్య ఫలాలు పొందడంతో పాటు నరకాగ్నినుంచి కాపాడబడతాడు



అడ్మిషన్ల కోసం అడ్డదారులు!

- జిల్లాలో కార్పొరేట్ కళాశాల గ్లోబల్ ప్రచారం
- రాని ర్యాంకులు వచ్చినట్లు ప్రకటనలు
- తల్లిదండ్రులు, విద్యార్థులను మోసం చేస్తున్న ఇంటర్ కళాశాలలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

నిజామాబాద్ అర్బన్, మార్చి 31: జిల్లాలోని కార్పొరేట్ ఇంటర్ కళాశాలలు తమకు రాని ర్యాంకులు, మార్కులను ప్రచార అస్త్రంగా ఉపయోగిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను, సమాజాన్ని మోసం చేస్తున్నాయి. అడ్మిషన్ల కోసం అడ్డదారులు తొక్కుతూ తాము చెప్పిందే నిజమని అదే నమ్మాలని విష ప్రచారం చేసుకుంటూ విద్యావ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల సమయం రాగానే ఏదో ఒక జిమ్మిక్కులు చేసి జిల్లా విద్యార్థులను, తల్లిదండ్రులను తేలికగా మోసం చేయవచ్చుననే ఆలోచనతో కార్పొరేట్ కళాశాలలు గ్లోబల్ ప్రచారానికి తెరలేపుతున్నాయి. హైదరాబాద్ లాంటి పట్టణాలలో విద్యార్థులను పంపించలేని తల్లిదండ్రులు సదరు కళాశాలలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ఇక్కడే తమ పిల్లలను చదివించేందుకు సిద్ధమవుతున్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల నారాయణ జూనియర్ కళాశాల ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఇటీవల వచ్చిన ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు ప్రచారం చేశారు. కానీ ఆ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులే లేకపోవడం కొసమెరుపు. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న విద్యాసంస్థలు విష ప్రచారాన్ని నిర్వహిస్తూ జిల్లాకు చెందిన విద్యాసంస్థలను నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో చిన్నా చితక ప్రైవేటు కళాశాలలు మూతబడిపోగా కొన్ని మాత్రమే కొనసాగుతున్నాయి.

ప్రచార ఆర్బాటాలే..

జిల్లాలో రోజుకొక కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటు అవుతున్నాయి. ఇతర జిల్లాలకు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం జిల్లాలో తమ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇతర జిల్లాలలో వచ్చిన ర్యాంకులను, మార్కులను ఇక్కడ సాధించినట్లు పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, కరపత్రాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాధించిన ర్యాంకులు, మార్కులను ఎరగా చూపుతూ ఇక్కడ అడ్మిషన్ల వల వేస్తున్నారు. పిల్లలను బాగా చదివించాలనుకునే తల్లిదండ్రులను అదేమి పట్టించుకోకుండానే తమ పిల్లలను సదరు కళాశాలల్లో వేసి తీరా విద్యాసంవత్సరం ప్రారంభమైన తర్వాత సదరు కళాశాలలు చేసిన మోసాన్ని గ్రహించి నివ్వెర పోతున్నారు.

తప్పుడు ప్రచారాలతో ఫ్లెక్సీల ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచ్‌లు కలిగిన నారాయణ జూనియర్ కళాశాల నగరంలోని వినాయక్‌నగర్‌లో కొనసాగుతుంది. ఆది నుంచి వివాదాస్పదంగానే ఆ కళాశాల ఏర్పాటు అయ్యింది. మొదటి సంవత్సరం అనుమతి లేకుండానే ప్రారంభమైన కళాశాల అతితక్కువ మంది విద్యార్థులతో కొనసాగుతోంది. గత విద్యా సంవత్సరం మధ్యలోనే కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ వెళ్లిపోగా విద్యాసంవత్సరాన్ని ఏదో మమా అంటూ ముగించారు. కానీ ఇటీవల విడుదలైన ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు మర్రి హర్ష, ఎం.లిఖిత్, ఎస్.కీర్తన, ఎంకే సుస్రిజలు జేఈఈ మెయిన్స్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంక్‌తో పాటు ఇతర ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. వాస్తవానికి ఈ విద్యార్థులు ఆ కళాశాలలో ఎప్పుడో ఇంటర్ పూర్తి చేశారు. లాంగ్‌టర్మ్‌లో కోచింగ్ తీసుకొని ఈ ర్యాంకులు సాధించినట్లు తెలిసింది. కానీ తమ విద్యార్థులే జిల్లా ఫస్ట్ సాధించినట్లు జిల్లాలోని అన్ని పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద తప్పుడు ప్రచారాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులే లేకపోగా ఈ ర్యాంకులు ఎలా వచ్చాయంటూ విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కనీసం కలెక్టర్, ఇంటర్ ఉన్నతాధికారులు ఇటువంటి మోసాలను, మోసపూరిత ప్రకటనలపై కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోకపోతే ఎలా అని విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

: రఘురాం, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి

తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను మోసం చేస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. రాని ర్యాంకులను గ్లోబల్ ప్రచారం చేసుకుంటూ జిల్లా విద్యార్థులను మోసం చేస్తున్న కళాశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలి. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

తప్పుడు ప్రకటనలపై చర్యలు తప్పవు..

: రవికుమార్ (డీఐఈవో)

విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందంటే చాలు కార్పొరేట్ కళాశాలలు తమకు రాని ర్యాంకులు, మార్కుల గురించి ప్రచారం నిర్వహిస్తూ మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాంటి కళాశాలలపై నిఘా పెట్టి తప్పుడు ప్రకటనలు ఇస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం.



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం

కామారెడ్డి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మర్చిపోవాలని వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిసారించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటి కేసీఆర్‌కు జహీరాబాద్ ఎంపీ సీటును కానుకగా ఇవ్వాలన్నారు. పార్టీనాయకులు, కార్యకర్తలు 40 రోజుల పాటు కష్టపడి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు గురిచేస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు తామంతా అండగా ఉంటామని కేసులకు భయపడవద్దన్నారు. తెలంగాణ ఉద్యమం తొలినాళ్లలో గులాబీ జెండాను గుండెకు తాకుకొని తొలి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకున్న ప్రాంతం కామారెడ్డి అని గుర్తుచేశారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సత్యగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో, లింగంపేట మండల కేంద్రంలోని మరో ఫంక్షన్‌హాల్‌లో కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు.

హరీశ్‌రావు ముందు ఎంపీటీసీ భర్త నిరసన

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సత్యగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అయితే ఆ సమావేశంలో మాచారెడ్డి మండల ఎంపీటీసీ భర్త రాగుల ప్రభాకర్ సభ వేదిక ముందట కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఎన్నో సంవత్సరాల నుంచి సేవలు చేస్తున్నప్పటికీ పార్టీ తనను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తన నిరసనను తెలిపారు.





● సీఎంసీని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

పార్లమెంట్ ఎన్నికలకు అధికారుల సన్నద్ధం

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- పార్లమెంట్ పరిధిలో 16లక్షల 94,616 మంది ఓటర్లు

నిజామాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఓటరు లిస్టుల ప్రకటనతో పాటు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఉద్యోగుల శిక్షణకు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే కోడ్ అమలు చేస్తున్న అధికారులు ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలను కొనసాగిస్తున్నారు. పోలింగ్‌తో పాటు కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో అధికారులను నియమించి ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని పనులను పూర్తి చేస్తున్నారు. సిబ్బందికి నియోజకవర్గాల వారీగా ఈవీఎంలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఓటరు జాబితా విడుదల

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోని ఓటరు జాబితాను ప్రకటించారు. పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16లక్షల 94,616 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 8లక్షల 1172 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8లక్షల 93,356 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 88 మంది ఉన్నారు. శాసనసభ ఎన్నికల నిర్వహణ సమయంలో ఈ ఏడు నియోజకవర్గాల పరిధిలో 16లక్షల 72,118 మంది ఓటర్లు ఉన్నారు. అప్పటికి ఇప్పటికి దాదాపు 22,498 మంది ఓటర్లు పెరిగారు. యువ ఓటర్లు చేరడం వల్ల ఓటర్ల సంఖ్య పెరిగింది. కొత్తగా చేరిన వారిలో పురుష ఓటర్లు 6,353 మంది ఉండగా, మహిళా ఓటర్లు 16,131 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 14 మంది నమోదు అయ్యారు. కొత్త ఓటర్ల చేరికతో పాటు మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 1807 పోలింగ్ కేంద్రాలను ఏడు నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల కోసం పీడబ్ల్యూడీ ఓటర్లను గుర్తించారు. మొత్తం 41,138 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 85 ఏళ్లు దాటిన వారు 9,865 మంది ఉన్నారు. ఈ ఎన్నికల కోసం మొత్తం పార్లమెంట్ పరిధిలో 512 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ ఎన్నికల కోసం 27 బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్, 28 బృందాల ఎస్ఎస్‌టీ, 22 వీఎస్‌టీ బృందాలను నియమించారు. వీటి ద్వారా ఎన్నికల కోడ్‌ను పర్యవేక్షిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం పోలింగ్ కేంద్రాలను 190 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు.

సిబ్బందికి శిక్షణ

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను కేటాయించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన పార్టీల నేతల సమక్షంలో ఈ ఈవీఎంలను కేటాయించారు. పోలీస్ సిబ్బంది ర్యాండమైజేషన్‌కు అనుగుణంగా ఆయా సెగ్మెంట్లకు కంట్రోల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్‌లను, సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించారు. పోలీస్ భద్రత మధ్య నియోజకవర్గాల కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు

ఎన్నికల పోలింగ్ తర్వాత కౌంటింగ్ కోసం డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఏర్పాట్లు చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుతో పాటు కౌంటింగ్‌కు కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర బలగాల ద్వారా బందోబస్తును ఏర్పాటు చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను పోలింగ్ తర్వాత సీఎంసికి తరలించి భద్రపర్చనున్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇచ్చిన ఉద్యోగుల ఆధ్వర్యంలో కౌంటింగ్ చేపట్టనున్నారు. ఈ ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రకటించారు. సీఎంసీని సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయితో పాటు ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

ఎన్నికలకు కోడ్ అమల్లో ఉండటంతో గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్, రవాణా, వాణిజ్య శాఖల ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల డబ్బులను పట్టుకున్న అధికారులు ఓటర్లను ప్రలోబ పెట్టేందుకు చీరలు, ఇతర వస్తువులను తరలించే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో నజర్ పెట్టారు. అధికారులతో సమీక్షిస్తూ కలెక్టర్, ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్‌లు సమీక్షిస్తున్నారు. కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు ఇస్తూనే పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



జోరుగా మిర్చి అమ్మకాలు

- మిర్చి కొనుగోలుకు మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తరలుతున్న జిల్లా వాసులు

బోధన్ రూరల్, మార్చి 31: ఎండాకాలం వచ్చిందంటే జిల్లా ప్రజలు మిర్చి, పప్పులు కొనుగోలు చేసి సంవత్సరం పాటు నిల్వ ఉంచుకోవడం ఆనవాయితీ. మిర్చి కొనుగోలులో జిల్లా వాసులకు ప్రత్యేకత ఉంది. జిల్లాకు దగ్గరలో ఉన్న ధర్మాబాద్ ప్రాంతం మిర్చి కొనుగోలు, అమ్మకాలకు పేరు గాంచింది. మహారాష్ట్రలోని ధర్మాబాద్ ప్రాంతం పేరుకే మహారాష్ట్రలో ఉన్నా అక్కడ తెలుగు వారు అధికంగా ఉంటారు. మహారాష్ట్ర తెలంగాణకు సరిహద్దులో ఉండడంతో ధర్మాబాద్‌కు ప్రత్యేకత చోటు చేసుకుంది. అక్కడి మార్కెట్ జిల్లా వాసుల కొనుగోళ్లతో కళకళలాడుతోంది. ప్రస్తుతం మిర్చి మార్కెట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ధర్మాబాద్ మారింది. ధర్మాబాద్‌లోని మార్కెట్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడి మార్కెట్ యార్డులో మిర్చితో పాటు పప్పుదినుసులు, జొన్నలు క్రయవిక్రయాలు జోరుగా కొనసాగుతాయి. సీజన్‌ల వారిగా ఇక్కడ వ్యాపారం సాగడంతో పాటు ఏడాదంతా అన్ని రకాల దినుసులు మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. ధర్మాబాద్‌లో తేజ మిర్చికి బాగా డిమాండ్ ఉంటుంది. క్వింటాలు ఎండు మిర్చి ధర రూ.35 వేలకు పైన పలుకుతోంది. మిర్చి కొన్న తరువాత తొడిమలు తీసి స్వయంగా కారంపొడి ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. బోధన్, జిల్లా ప్రాంతానికి 30 కిలోమీటర్ల లోపు ధర్మాబాద్ మార్కెట్ ఉండడంతో పాటు రైలు సౌకర్యం ఉండడం ఇక్కడి వాసులకు కలిసి వస్తుంది. బోధన్ డివిజన్‌లోని అన్ని మండలలాలతో పాటు, జిల్లా కేంద్ర వాసులు, కామారెడ్డి వాసులు సైతం ఇక్కడికి వచ్చి మిర్చి కోనుగోలు చేస్తారు. పేరుకే ధర్మాబాద్ మార్కెట్ అయినప్పటికీ ఇక్కడ క్రయ విక్రయాలు జరిపే వారంతా జిల్లా వాసులే కావడంతో ధర్మాబాద్ మార్కెట్ అన్ని రకాల వస్తువులకు అడ్డాగా మారింది. ప్రస్తుతం జిల్లా పరిసర ప్రాంతాల నుండి ఎండు మిర్చి కొనుగోలు కోసం రోజువారి వందాలది మంది ధర్మాబాద్ మార్కెట్‌కు తరలి వెలుతున్నారు. అక్కడి మార్కెట్‌లో నాణ్యతతో కూడిన ఎండు మిర్చి లభించడంతో మంచి డిమాండ్ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో పది నుంచి 20 మంది ఒక చోట చేరి ఒక ఆటోను ఏర్పాటు చేసుకుని మిర్చి కొనుగోలు కోసం ధర్మాబాద్ వెల్లడం అక్కడి నుండి కొనుగోలు చేసి రావడం ప్రతి ఏటా సీజన్‌లో కొనసాగుతూనే ఉంది. ప్రజ్ఞుతం మిర్చి క్రమ విక్రయాలతో ధర్మాబాద్ కళకళలాడుతోంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

మెండోర, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ జమాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో బాధిత కుటుంబసభ్యులను ఆదివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, కాంగ్రెస్ నాయకులు సుమో రాజేశ్వర్, కొప్పెల మోహన్, బద్దం అశోక్, మౌలానా, బాస్కర్, గంగాధర్, డి.రాజారెడ్డి, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

శక్కర్‌నగర్‌లో వివాహిత ఆత్మహత్య

బోధన్ రూరల్, మార్చి31: బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీకి చెందిన సబియా నౌసీన్ (36) అనే మహిళ ఆదివారం తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. భర్త అదనపు కట్నం కోసం వేధించేవాడని, అత్తింటి వారి వేధింపులు భరించేక ఇంట్లో ఫ్యాను రాడుకు చున్నీతో ఉరి వేసుకుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

బైక్, సైకిల్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రూరు, మార్చి 31: బైక్, సైకిల్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంగడి బజార్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ సైకిలిస్టును ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బర్ధిపూర్ చర్చీలో ఘనంగా ఈస్టర్

డిచ్‌పల్లి, మార్చి 31: మండలంలోని డిచ్‌పల్లి, బర్ధిపూర్, నడిపల్లి, తెలంగాణ ఏడవ పోలీస్ బెటాలియన్, అమృతాపూర్, కంజర్ గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నడిపల్లి చర్చిలో ఈస్టర్ వేడుకల సందర్భంగా చర్చి ఫాదర్ స్టీవెన్ క్రైస్తవులకు ఈస్టర్ వేడుకల సారాంశాన్ని అర్థమయ్యే విధంగా వివరించారు. బర్ధిపూర్ చర్చిలో చర్చి ఫాదర్ దినకర్ మాట్లాడుతూ క్రీస్తు మరణించిన తర్వాత మూడవ రోజు ప్రపంచ మానవాళికి శాంతిస్ఫూర్తిని తెలియజేశారని ఆయన వివరించారు. ఈస్టర్ వేడుకల సందర్భంగా కొవ్వొత్తులను వెలిగించి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి నాయకులు దేవరాజు, శ్రీనివాస్, పద్మారావు, ప్రకాశం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'పేకాట ఆడితే కఠిన చర్యలు'

బోధన్ రూరల్, మార్చి 31: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ సైఐ వీరయ్య తెలిపారు. శనివారం రాత్రి రాకాసిపేట్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పేకాట స్థావరం నుంచి 5,740 రూపాలయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

సిరికొండ మార్చి 31 : సిరికొండ మండలం పీసరగుట్ట తండాకు చెందిన గిరిజన యువకులు ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని ఎమ్మెల్యే వారిని కోరారు. పార్టీలో చేరిన వారిలో తిరుపతి నాయక్, లక్ష్మణ్ నాయక్, హరినాయక్, గణపతినాయక్, కేతావత్ హరినాయక్, మహిపాల్ నాయక్, నౌషిలాల్, మోహన్‌నాయక్, తదితరులున్నారు.

'విధులను బాధ్యతతో నిర్వర్తించాలి'

మోపాల్, మార్చి 31: ఏ ఉద్యోగమైనా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గంగాధర్ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగుల సంఘం సభ్యులు, తదితరులున్నారు.

మంచిప్పలో బోనాల పండుగ



మంచిప్పలో బోనాల ఊరేగింపు

మోపాల్, మార్చి 31 :మండలంలోని మంచిప్ప గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తల్లినల్లపోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు తెలిపారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా లభించేందుకు, ప్రజలందరూ ఆయురారోగ్యాలు ఆతల్లి ప్రసాదించాలని కోరుతూ బోనాలు, నైవేద్యాలతో నల్లపోచమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని నడిబొడ్డున గల సరగమ్మల దగ్గర పూజించుకొని సుమారు రెండు కిలోమీరు దూరంలో ఉన్న నల్లపోచమ్మ వరకు ఊరేగింపు డప్పు వాయిద్యాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు, గ్రామ యువకులు, అన్ని కులాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

నిజామాబాద్ అర్బన్, మార్చి 31:కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆదివారం నిజామాబాద్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఉదయం నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వాకర్స్‌తో వాకింగ్ చేస్తూ ఆయన తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులను అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం డాక్టర్ కవితారెడ్డి, న్యాయవాది రాజేందర్‌రెడ్డి ఇండ్లకు వెళ్లి తనకు సహకరించాలని జీవన్‌రెడ్డి కోరారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, గడుగు గంగాధర్, కేశవేణు, రత్నాకర్, దయాకర్ గౌడ్, శేఖర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

డీఐఈవోగా రవికుమార్



నిజామాబాద్ అర్బన్, మార్చి 31: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారిగా రవికుమార్ నియమితులయ్యారు. ఇదివరకు డీఐఈవోగా పనిచేసిన రఘురాజ్ ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న రవికుమార్‌ను డీఐఈవోగా నియమిస్తూ ఇంటర్ విద్యాశాఖ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన డీఐఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. డీఐ ఈవోగా పనిచేసిన రఘురాజ్‌కు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం నగరంలోని బస్వాగార్డెన్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మోదీని మరోసారి గెలిపించాలి : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

పెద్దబజార్, మార్చి 31: దేశాభివృద్ధికోసం మోదీని మరో సారి గెలిపించాలని అని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి అర్వింద్ అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా చూడాలన్నారు. అవినీతి లేకుండా అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. అవినీతి లేకుండా అభివృద్ధి ఎలా చేసుకోవచ్చో చూపించిన పార్టీ బీజేపీ అని అన్నారు. భారతదేశంలో ఎటువంటి ప్రణాళికను రూపొందిస్తే సమాజానికి బాగుంటుందో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, యువత సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్‌కులాచారి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, స్రవంతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు ఆకుల హేమలత శ్రీనివాస్, మమత ప్రభాకర్, బీజేపీ నాయకులు బంటురాము, శ్రీనివాస్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

11 స్టార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

భీమ్‌గల్ రూరల్, మార్చి31: భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో ఆదివారం షై 11 స్టార్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని శివసాయి హాస్పిటల్ మేనేజర్ డాక్టర్ సాయి యాదవ్ ప్రారంభించారు. మొత్తం 60 టీములు పాల్గొనడం జరిగింది. ఈ రోజు లీక్ మ్యాచ్‌లు స్టాట్ చేయడం తో టోర్నీ ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఎంపిటిసి రాజు, ఉపసర్పంచ్ శ్రీకాంత్, పెద్దోళ్ల రాజేందర్, కోమన్‌పల్లి కిషన్, ప్రశాంత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

ఏర్గట్ల, మార్చి 31: కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఖనిజ వనరుల శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు ఆదివారం ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈరవత్రి అనిల్‌ను తన స్వగృహంలో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్త తమ కుటుంబ సభ్యుడితో సమానమని తనకున్న ప్రాముఖ్యతే కార్యకర్తలకు ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రొక్కెడ సంజీవ్, జుంగల గణేష్ తదితరులు పాల్గొన్నారు

ట్రాక్టర్, స్కూటీ ఢీకొని ఒకరి మృతి

జక్రాన్‌పల్లి,మార్చి31: మండలంలోని బాలనగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై స్కూటీ, ట్రాక్టర్ ఢీకొని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన తలారి బుర్రన్న(42)అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎఎస్సైసుశీల్‌కు మార్ తెలిపారు. ఎఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని బాలానగర్ నుంచి స్కూటీపై వెళ్తున్న బుర్రన్నను వెను క నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎఎస్సై సుశీల్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కోటగిరి,మార్చి31: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య(56) అనే వ్యక్తి చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మొగులయ్య రెండు రోజుల క్రితం స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే సమయంలో వల కాళ్లకు చుట్టుకుని నీట మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరారీ అయిన నిందితుల కోసం గాలింపు

నవీపేట,మార్చి31: నిజామాబాద్ మండలం పాల్దాలో శనివారం దొంగతనానికి యత్నించి పరారీ అయిన ఐదురుగు నిందితుల కోసం గాలింపు జరుపుతున్నామని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, ఎస్ఐ యాదగిరి గౌడ్‌లు తెలిపారు. శనివారం పాల్దా గ్రామ శివారులో ఉన్న మూతబడిన రైస్‌మిల్లులో ఆరుగురు వ్యక్తులు దొంగతనానికి యత్నించగా ఇందులో ఐదుగురు పరారీ కాగా ఇందులో ఒకరైన డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి తండాకు చెందిన బానోత్ సునీల్(44)అనే వ్యక్తిపై గ్రామస్థులు దాడి చేయడంతో అతడు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయంపై పలువురు గ్రామస్థులపై సైతం కేసు నమోదు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. శనివారం రాత్రి నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్, నవీపేట ఎస్ఐ యాదగిరి గౌడ్‌లు పాల్దా గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గే ప్రమాదం



పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్‌ఫోటో)

ఆర్మూర్‌రూరల్, మార్చి31: గేదేజాతి, గోజాతి పశువులకు వైరస్ వల్ల సంక్రమించే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. ఈవ్యాధి సోకిన పశువుల్లో నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. దీని వల్ల పశువులు ఆహారం తీసుకో వడానికి ఇబ్బందిపడడంతో పాటు నడవడానికి కూ డా కష్టంగా మారుతుంది. దీని వల్ల పశువులు మే తకు వెళ్లలేక ఒకవేళ ఇంటివద్దే మేత మేసినప్ప టికీ నోటిలో ఉన్నపండ్లవల్ల పశుగ్రాసం తినలేక బలహీన పడిపోతుంది.గాలికుంటు వ్యాధిసోకిన పశువులు మృత్యువాతపడే అవకాశాలు తక్కువగాఉన్నప్పటికీ పాల ఉత్పత్తిగణనీయంగా తగ్గిపోతుంది.పశువు ల కు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందుజా గ్రత్త చర్యల్లో భాగంగా పశుసంవర్ధక శాఖద్వారా నిర్వ హిస్తున్నగాలికుంటువ్యాధి నివారణటీకాలు వేయించాలని పశువైద్యాధికారులు రైతులకు సూచిస్తు న్నారు.

● గాలికుంటు వ్యాధి వైరస్

గాలికుంటువ్యాధిఅనేది ఒకవైరస్ ఇదీగాలి ద్వారా ఒక పశువు నుంచి ఇంకో పశువుకు సంక్ర మిస్తుంది. ఈ వైరస్ గాలిలో చాలా సులువుగా ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి సోకుతుంది. ప శువుల మందలో ఒకటి రెండు పశువులకు గాలి సోకిన అవిమిగతా పశువులకు సోకే ప్రమాదం ఉం ది.ఈ వ్యాధిసోకిన వెంటనే పాల దిగుబడి తగ్గిపోతుంది.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 106డిగ్రీల ఫారన్‌హీట్ వరకు ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వ్యాధి వల్ల పశువుల్లో నాలుకలో పండ్లు ఏర్పడడంతో తెల్లటి నురుగా కారుతుంది. ముఖ్యంగా ఎద్దులకు ఈ వ్యాధి సోకితే వ్యవసాయ పనులకు దూరం ఉంచాల్సి వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు రక్తహీనతతో బాధపడుతూ ఉండడం వల్ల వాటి శ్వాస క్రియ ఇబ్బందిగా మారుతుంది. ఈ వ్యాధి సో కిన పశువులు ఎండ వేడికి తట్టుకోలేక సరైన మేత తినకుండా నిరసించి పోతాయి. వీటికి పశువైద్యు లచే చికిత్స అందించినప్పటికీ ఈ వ్యాధి వల్ల కలిగిన దుష్ఫలితాల వల్ల పశువులు పూర్తిగా కొలుకోవడానికి రెండు, మూడు నెలల సమయం పడుతుంది.

● వ్యాధి నివారణ

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను మొదటి సారి మూడు నెలల వయస్సులో ఇవ్వాలి. తర్వాత ప్రతీ సారి క్రమం తప్పకుండా ఇప్పిస్తూ ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రతీ ఆరు నెలలకోసారి నిర్వహిస్తోంది. గ్రామాలను పశువైద్యులు సందర్శించిన సమయాల్లో రైతులు వీరి సేవలను వినియోగించుకుంటే పశువులను జాగ్రత్తగా కాపాడుకోవచ్చు.

వ్యాధిని కట్టడి చేయాలి ఇలా.....

●ఒక వేళ పశువుకు గాలికుంటు వ్యాధి సోకినట్టు నిర్ధారిస్తే ఆ పశువును మిగతా పశువుల నుంచి వేరుగా దూరంగా ఉంచాలి.

● వ్యాధి సోకిన పశువు వేసిన ప్రాంతంలో మిగతా పశువులు మేయకుండా జాగ్రత్త పడాలి.

● గాలికుంటు వ్యాధి పశువులను మందలోకి పంపకుండా జాగ్రత్త పడాలి.

● వ్యాధిసోకిన పశువుల యాజమానులు ఆ పశువుకు దగ్గరగా ఉండేవాళ్లు ఇతర పశువుల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే వ్యాధి సోకిన పశువును ముట్టుకున్న రైతు ఇతర పశువులను ముట్టుకుంటే వాటికి సోకే అవకాశం ఉంటుంది.

● గాలికుంటు వ్యాధి సోకిన పశువు యొక్క పాలు దూడలకు తాగించకుండా చూడాలి. పాలు పట్టాల్సి వస్తే ఇతర పశువుల నుంచి పాలను వీటికి తాగించాలి.

● వ్యాధి సోకిన పశువు నోటిని యాంటిసెప్టిక్ ద్రవణంతో కాడగాలి. ఒక శాతం పోటాషియం పార్మంగనెట్ ద్రావణానిన రోజులో మూడు నుంచి నాలుగు అప్లయ్ చేయాలి.

● కాలిగిట్టల మధ్య పుండ్లు ఉంటే రెండు శాతం కాపర్ సల్ఫేట్ ద్రావణంలో పశువుల కాళ్ళను కాడగాలి. కాలిగిట్టలపైన ఈగలు వలకుండా యాంటిసెప్టిక్ క్రిములను వాడాలి.

● వ్యాధి సోకిన పశువున్న ప్రాంతాన్ని ప్రతీరోజు శుభ్రం చేయాలి. సోడియం హైడ్రాక్సిడ్ ద్రావణంతో గాని, సోడియం కార్బోనేట్ సిట్రిక్యాసిడ్‌తో పశువున్న ప్రాంతాన్ని శుభ్రం చేయాలి. వ్యాధి సోకిన ఉన్న ప్రాంతంలో సున్నం చల్లడం కూడా వ్యాధి కారక వైరస్‌ను నియంత్రించవచ్చు.

బ్రహ్మోత్సవాల్లో ప్రముఖులు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న నిర్మాత శిరీష్, నటుడు సురేందర్‌రెడ్డి

మోపాల్, మార్చి 31 : మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న రెండవ రోజు బ్రహ్మోత్సవాల్లో నిర్మాత శిరీష్, నటుడు సురేందర్‌లు పాల్గొన్నారు. దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగోత్రి రామానుజ స్వామి మాట్లాడుతూ ఉత్సవం అంటే లోకం అంతా సంతోషించడం, బ్రహ్మోత్సవం అంటే సాక్షాత్తు బ్రహ్మమే లోకకల్యాణం కోసం జరిపించే ఉతక్తైవం బ్రహ్మోత్సవం అన్నారు. బ్రహ్మోత్సవాల్లో గరుడుని మొదటగా ఆహ్వానించి ప్రార్థించారు. వైనతేయ ఇష్టి కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించి గరుత్మంతుని అనుగ్రహం కొరకు యజ్ఞం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఉత్సవంలో ఆలయ ధర్మకర్తలు, ప్రముఖ నిర్మాత శిరీష్, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, రవియాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, మార్చి 31:నేడు నగరంలోని వినాయక్‌నగర్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. వినాయక్‌నగర్ ఉపకేంద్రం పరిధిలోని న్యాల్‌కల్ చౌరస్తా, సూర్యనగర్, చంద్రనగర్, కోటగల్లి, హనుమాన్‌నగర్, పద్మానగర్ రోడ్, యాదగిరిబాగ్, రిలయన్స్ మార్ట్, విజయలక్ష్మిగార్డెన్, వినాయక్‌నగర్ ప్రాంతం లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగరంగా వైభవంగా మల్లన్న జాతర



మల్లన్నస్వామికి నైవేదాయులు సమర్పిస్తున్న భక్తులు

మెండోర, మార్చి31: మండల కేంద్రంలో శ్రీశ్రీ మల్లన్నస్వామి జాతరను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా స్వామివారికి ఉదయం కళ్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు.మల్లన్న జాతరలో పిల్లలు సందడి చేశారు. సాయంత్రం గ్రామంలో ఉన్న మల్లన్న ఆలయం నుంచి గ్రామ వీదులగుండా డప్పు సప్పుళ్ళతో మంగళహారతులతో మహిళలు బోనాలు ఎత్తుకొని మల్లన్న గుట్టకు చేరుకొని స్వామికి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా యాదవ సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం రథో త్సవం కార్యక్రమం నిర్వహిస్తామని చుట్టు పక్కల ప్రజలు రథోత్స వంలో పాల్గొని విజయవంతం చేయాలనియాదవ సంఘ సభ్యులు తెలిపారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● ఫోన్‌ట్యాపింగ్, మేడిగడ్డ పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సిరికొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ మార్చి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయినందునే మేడిగడ్డపై ఫోన్‌ట్యాపింగ్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎద్దేవా చేశారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా విఫలం చెందాయని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 115 రోజుల్లోనే ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయక పోగా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని అటుకెక్కించదని ఆరోపించారు. రైతు భరోసా ఎకరాన రూ.15వేలు, కుటుంబంలో మహిళకొకరికి రూ.2500లు అమలు చెల్లించడంలో పూర్తిగా విఫలమయ్యిందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు.ఎన్నికల్లో ఆచరణకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసగించిందన్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు మూడు పిల్లర్లు కుంగితే మరమ్మతు చేయకుండా తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు.ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షా కోట్లు అవినీతి జరిగిందని, ఫోన్ ట్యాపింగ్ పేరుతో తప్పుడు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డుపై మోడీతో జీవో కాపీ ఇప్పించి ప్రజలను మరో సారి మోసం చేయడానికి వస్తున్నాడని గుర్తు చేశారు. ఎంపీగా ప్రజలకు మంచి పనులు చేసి ఉన్న, అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చిన దాఖలాలు లేవు కనుక మోదీ పేరుతో అర్వింద్ ఓట్లడగుతున్నారని అన్నారు. మోదీ పేరుతో ఓట్లడుగుతున్న వంటేనే ప్రజలకు దూరమయ్యావని తెలిపోయిందన్నారు.బీజేపీ కార్యకర్తలే అర్వింద్‌కు ఓట్లేయరని బాజిరెడ్డి ఎద్దేవా చేశారు.ఎంపీ గెలిచి ప్రతిపక్ష,పాలక పక్షా పార్టీల నాయకులను విమర్శించడానికే ఐదేళ్లు కాలయాపన చేశావని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసుకుంటు కేవలం సోషల్ మీడియ ఎంపీగా చరిత్రలో నిలిచి పోయాడని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రశ్నించి పనులు సాధిస్తానన్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా ముథ్కేడ్ వరకు రైల్వే లైన్ డబుల్ లైన్ కోసం పోరాడి సాధిస్తనని హామీ ఇచ్చారు.జక్రాన్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కోసం కొట్లాడి సాదిసానన్నారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు ఆయన చెప్పారు. నియోజక వర్గంలో ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుండడం, నిజామాబాద్ రూరల్లో తాను. అర్బన్ గణేష్ గుప్తా, బోదన్‌లో శకీల్ ద్వారా విస్తృతంగ ప్రచారం చేసి గెలుపొందుతానన్నారు. ఈ మావేశంలో జడ్పీటీసీ సభ్యులు బాజిరెడ్డిజగన్, మాలవత్ మాన్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు భూదెవ్వ, రమేష్, డైరెక్టర్ తదితరులు ఉన్నారు,

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



బాలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్సీ సంఘ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, మార్చి31: వేల్పూర్ మం డలం జాన్కంపేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 30ఏళ్లగా పీటీఎఫ్‌గా (తాత్కా లిక అటెండర్) పని చేస్తూ ఇటీల మృతి చెందిన బట్టు పెద్దబాలయ్య కుటుంబానికి ఆదివారం జాన్కంపేట్ ఎస్సీ సంఘ సభ్యు లు రూ.12వేల నగదు'ను ఆర్థిక సహాయంగా అందజేశారు. బట్టు పెద్ద బాలయ్య స్వగ్రామ మైన చేంగల్‌లో ఆయన భార్యకు ఈ నగదు ను అందజేశారు. అదే విధంగా ఇటీవల వేల్పూర్ మండల ఉపాధ్యాయులు రూ.47 వేలను వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేయగా ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు రూ.40వేల 500 ఆర్థిక సహాయాన్ని అటెండర్ బాలయ్య కు టుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంఘ సభ్యులు శేఖర్, రూ పేష్, సిరిల్‌రావు, సౌడ ప్రభాకర్‌రావు, తలారి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

32, 33వార్డుల్లో సంపర్క్ యోజన కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్ మార్చి31: మున్సిపల్ పరిధిలోని 32, 33వార్డులలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం లాబర్డి సంపర్క్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాబర్డి సంపర్క్ యోజన కన్వీనర్ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్విం ద్‌ను గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని వారు కోరారు. అనంతరం మోదీ స్టిక్కర్‌ను కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్‌కుమార్, పొల్కం వేణు, శికారి శ్రీనివాస్, డికె.శ్రీని వాస్, దోండి ప్రకాష్, పాలబాస్కర్, దక్షిణ మూర్తి, నారాయణపేట్ రాజేందర్, పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కనక రవి

జక్రాన్‌పల్లి, మార్చి31: జక్రాన్‌పల్లి మండల ఎస్సీసెల్ అధ్యక్షునిగా కనక రవిని నియమించారు. ఈ మేరకు ఆదివారం కనక రవిని నియామక పత్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల యువజన విభాగం యూత్ అధ్యక్షుడు వినోద్, రూరల్ యూత్ అధ్య క్షుడు నరేష్, మాజీ సర్పంచ్ మునిపల్లి సాయిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిశోర్, ప్రధానకార్యదర్శి వినోద్, మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు కిరణ్ అనుపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 31: వైష్ణవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శ్రీవైష్ణవ రాష్ట్ర రజతోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మపురిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తిరువెంగళాచార్యులు, మోహనచార్యులు, లక్ష్మినాథచార్యులు, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

● బ్రాహ్మణులను ఐక్యం చేసేందుకు ముందుకు...

భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు స్ఫూర్తితో దేశంలో ఉన్న బ్రాహ్మణులను ఐక్యం చేయడానికి ముందుకు పోతున్నామని రాష్ట్ర అధ్యక్షుడు బండారి రాంప్రసాద్ అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇబ్బందులు పడుతున్న బ్రాహ్మణులను ఆదుకుంటామని అన్ని జిల్లా కేంద్రాల్లో వేద పాఠశాలల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ భవన్ నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరావు, ఈఎల్ఎన్ రావు, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో ప్రారంభమైన ఎల్లమ్మ ఉత్సవాలు



డొంకేశ్వర్‌లో మంగహారతులతో మహిళలు

డొంకేశ్వర్ మార్చి31: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గౌడ కులస్తులు ఇంటికి తిరిగి జోలే బియ్యాన్ని సేకరించారు. డప్పువాయిద్యాలతో అం గరంగా వైభవంగా పోచమ్మలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఐదేళ్లకోసారి ఉత్సవాలు నిర్వహిస్తామని గౌడ సంఘ సభ్యులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మెండోర, మార్చి31: పేదలకు అన్ని విధాలుగా అండగా నిలిచి ప్రభుత్వం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి ద్యావతి స్రవంతికి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సీఎం సహాయనిధి నుంచి రూ.4లక్షల 50వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. బాధితురాలు స్రవంతి చెవి సమస్యతో బాధపడుతూ విషయం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడంతో తక్షణమే చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో టౌన అధ్యక్షుడు గుండోజి రవి, కొప్పెల రమేష్, మహేందర్, సాయిరాం, నవీన్, అనిల్, అశోక్, ముత్యం, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

25కుటుంబాలకు కుల బహిష్కరణ

● ఆదివారం ఏడుగురు సంఘ పెద్దలపై కేసు నమోదు

మోర్తాడ్, మార్చి 31: రజక సంఘం సభ్యులు అదే కులానికి చెందిన 25 మందిని కుల బహిష్కరణ చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో జరిగింది. బాధితులు పోలీసుల కథనం ప్రకారం.. మోర్తాడ్‌లోని రజక సంఘంలో 104 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో మూడు పంతలు (గ్రూపులు)గా ఏర్పాటు చేసుకున్నారు. యానంపల్లి, ఓరగంటి, కల్లురి పేరిట పంతలుగా ఉన్నారు. కాగా, యానంపల్లి పంతకు చెందిన ఓ మహిళ చనిపోవడం వల్ల అదే రోజు రాత్రి కొంత మంది భోజనం చేయగా మరికొందరు భోజనం చేయలేదు. దీనిని మనసులో పెటుకొని యానంపల్లి పంతకు చెందిన యానంపల్లి సాయిరాం, అదే రోజు వాట్సాప్‌లో అసభ్యకరంగా తిట్టడంతో ఓరుగంటి పంతవారు నిలదీశారు. అంతేగాక ప్రతీ సంవత్సరం గణేష్ నిమజ్జనం సమయంలో రజక కుటుంబాల నుంచి సుమారు ఆరు లక్షల రూపాయల వరకు వసూలు చేయడం జరుగుతుండేది. దీన్ని ఓరుగం టికి చెందిన కొందరు జమ చేసిన డబ్బులకు లెక్కలు చూపాలని రెండేళ్ల నుంచి అడుగగా యానంపల్లికి చెందిన సాయిరాం, మరికొందరు పట్టించుకోక తిరగబడి లెక్కలు చూపించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో ఓరుగంటి వారు గణేష్ మండలికి సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. దీనిని మనసులో పెట్టుకుబ న్నారు. కాగా, ఇటీవల యానంపల్లి సాయిరాం, కల్లూరి బాలరాజు, మరికొందరు కలిసి ఒరుగంటి పంతానికి చెందిన 25కుటుంబాలతో ఎవరు మాట్లాడవద్దని, మంచి చెడు కార్యక్రమాలకు వెళ్లవద్దని సంఘ లెటర్ ప్యాడ్‌పై తీర్మానం చేసుకున్నారు. ఎవరైనా సంఘ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.20వేల జరిమానా అని రాసుకున్నారు. భీమ్ గల్‌సీఐ, మోర్తాడ్ ఎస్సైలకు ఓరుగంటి పంత సభ్యులు శని వారం ఫిర్యాదు చేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఓరుగంటికి పంత సభ్యులు తెలిపారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.67,900	రూ.63,600	రూ.790

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 7.50, 10.50)
: ఓం భీమ్ భుష్ (4.40)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (5.20, 8.00, 10.40)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకర్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)
స్క్రీన్-4 : క్రూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.35, 7.30, 10.25)
స్క్రీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ 10.45, 1.50, 4.25, 10.25)
: ఓం భీమ్ భుష్ (7.30)
స్క్రీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.25, 10.40) : కలియుగ పట్టణంలో (4.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్